
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



7
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 14 జనవరి 2025

నేడు అవనియాపురం

జల్లికట్టు

మొదటి బహుమతిగా కారు



అడయార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అవనియాపురంలో మంగళవారం జల్లికట్టు పోటీ జరుగనుంది. పొంగల్ సందర్భంగా ప్రతిఏడాది తమిళులసంప్రదాయ, సాహస క్రీడ అయిన జల్లికట్టు పోటీ నిర్వహిస్తారు. అలంగానల్లూర్, పాలమేడు, అవనియాపురం ప్రాంతాల్లో నిర్వహించే జల్లికట్టు పోటీలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి. మంగళవారం పొంగల్ రోజున అవనియాపురంలో జల్లికట్టు నిర్వహించనున్నారు. దీనికోసం వడివాసల్, సందర్శకుల గ్యాలరీ, ఎద్దులు ఉంచే ప్రదేశం, ఎద్దులు వచ్చి వెళ్లే మార్గాల్లో బారికేడ్ల ఏర్పాటు, పోటీ జరిగే ప్రాంతం నుంచి సుమారు కి.మీ దూరంవరకుఇరువైపులా భద్రతకోసం ఫెన్సింగ్ నిర్మించారు. ఈ పోటీల్లో 1,100 ఎద్దులు పాల్గొననుండగా, 400 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. 1 నుంచి 100 వరకు టోకెన్లున్న ఎద్దులను ఉదయం 5 నుంచి 6 గంటల్లోపు అనుమతించనున్నారు. 100 నుంచి 200 వరకు టోకెన్లను 6 నుంచి 7 గంటల వరకు, తర్వాత ఒక్కో 100 టోకెన్లుండే ఎద్దులను వరుసగా గంట వ్యవధి చొప్పున సాయంత్రం 4 గంటల వరకు 1,100 వరకు టోకెన్లు పొందిన ఎద్దులను అనుమతించనున్నారు. ఈ నేపథ్యంలో, అవనియాపురం జల్లికట్టు పోటీల్లో అధిక ఎద్దుల్ని అదుపుచేసి ప్రథమస్థానంలో నిలిచే క్రీడాకారుడికి ముఖ్యమంత్రి తరఫున రూ.8.50 లక్షల విలువైన కారు బహుమతిగా అందించనున్నారు. అలాగే, ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబరచిన ఎద్దు యజమానికి తొలిసారిగా ట్రాక్టర్ బహుమతిగా అందించనున్నారు.

పాలమేడు, అలంగానల్లూర్...: బుధవారం పాలమేడు మంజుమలై నదీతీరంలోను, 16న అలంగానల్లూర్‌లో జల్లికట్టు పోటీలు జరుగనున్నాయి. పాలమేడు జల్లికట్టులో 4,820 ఎద్దులు, 1,914 మంది క్రీడాకారులు పేర్లు నమోదుచేసుకున్నారు. ఇక, రాష్ట్ర ప్రజలంతా ఆతృతగా ఎదురుచూసే అలంగానల్లూర్ జల్లికట్టు పోటీలకు 5,786 ఎద్దులు, 1,698 మంది క్రీడాకారులు పేర్లు నమోదుచేసుకున్నారు.



జల్లికట్టు మైదానంలో మెటల్ డిటెక్టర్లు, పోలీసు జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు



భోగి మంటల వద్ద చిన్నారుల నుంచి పెద్దల వరకు సందడి దృశ్యాలు





నగరాన్ని కమ్మేసిన పొగమంచు

రాష్ట్రంలో భోగి సందడి

పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికిన ప్రజలు

మంటలు వేసి డప్పులు వాయించిన చిన్నారులు

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తమిళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతున్న రాష్ట్రంలో పొంగల్ పండుగను ప్రజలు సోమవారం భోగి మంటలతో మొదలుపెట్టారు. భోగితో మొదలయ్యే వేడుకలు పొంగల్, మాట్టుపొంగల్, కానుంపొంగల్ వరకు నాలుగు రోజుల పాటు జరుపుకుంటారు. భోగి రోజున రాజధాని నగరం సహా పలు జిల్లాలను పొగమంచు కప్పేసింది. దీంతో ప్రజలంతా తమ ఇంటి ముంగిట మంటలు వేసుకుని వెచ్చదనాన్ని ఆస్వాదించారు. ఆ భోగి మంటల్లో తాము ఇప్పటి వరకు పడిన కష్టాలను, బాధలను అగ్నికి ఆహుతి ఇచ్చారు. ఉత్తరాయణంలో తమకు సుఖ, సంతోషాలను ఇవ్వాలని, ఇష్టదైవాలను కోరుకున్నారు. రాష్ట్ర పర్యావరణ శాఖ విజ్ఞప్తి మేరకు భోగి మంటల్లో వాతావరణ కాలుష్యానికి పెరగడానికి కారణమైన టైర్లు, ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా చెక్కలు, తాటి, ఈత, కొబ్బరి మట్టలు, పాత దుస్తులు, పాత సామాన్లు వేసి పండుగను జరుపుకున్నారు.

చిన్నారులపై భోగి పండ్లు...

భోగి రోజున చిన్నారులపై భోగి పండ్లు పోసి చిన్నారులను ఆశీర్వదించారు పల్లె ప్రాంతాల్లో చిన్నారులచే నూతన వస్త్రాలు ధరింపజేసి, రంగవల్లికల మధ్య కుర్చోపెట్టారు. రేగి పండ్లు, చెరకు గడ ముక్కలు, బంతిపూల రెక్కలు, శనగలు, పసుపు, బియ్యం, చిల్లర నాణెలను పోసి హారతి ఇచ్చి, పిల్లల తల మీద దిష్టి తొలగాలని పోశారు.

పొగ మంచుతో విమానాలకు అంతరాయం...

భోగి మంటల నుంచి వాపించిన పొగ, మరోవైపు పొగ మంచు రాజధాని నగరాన్ని కమ్ముకోవడంతో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు 30 విమానాలు ఆలస్యంగా బయలుదేరడంతో, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారుల్లో పొగ మంచు దట్టంగా వ్యాపించడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. త్రిశూలం ప్రాంతంలోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలను పొగమంచు కమ్మేయడంతో ఢిల్లీ, బెంగుళూరు నుంచి సోమవారం తెల్లవారుజామున నగరానికి రావలసిన మూడు విమానాలను రద్దు చేశారు. విమానాశ్రయం, పరిసరాల్లో ఉన్న మీనంబాక్కం, పొలిచ్చలూర్, పొమ్మల్, అనకాపుత్తూర్ తదితర ప్రాంతాల్లో వేసిన భోగి మంట పొగలు రన్‌వేపై వ్యాపించాయి. మరోవైపు మంచు కురుస్తుండటంతో వాతావరణం అనుకూలించక ఇక్కడి నుంచి 30 విమానాలు నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా బయలుదేరాయి.

తలైవాసల్‌లో పశుసంవర్ధక పరిశోధన కేంద్రం

ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా తలైవాసల్ కూడలిలో రూ. 564.44 కోట్లతో నిర్మించిన పశుదాణా ఉత్పత్తి, పశుసంవర్ధక పరిశోధన కేంద్రాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో సేలం జిల్లా తలైవాసల్ వద్ద నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఆ పరిశోధన కేంద్రానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పరిశోధన కేంద్రంతో పాటు దాని చుటూ పరిపాలనా భవనం, అతిథిగృహాలు, తొమ్మిది ప్రాంగణాలు సహా మొత్తం 126 భవనాలను సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనితా రాధాకృష్ణన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ ముఖ్య కార్యదర్శి సత్యప్రదసాహు, తలైవాసల్ పరిశోధన కేంద్రం సంచాలకులు కే కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. తలైవాసల్ పరిశోధనా కేంద్రం వద్ద మంత్రి ఆర్.రాజేంద్రన్, ఎంపీలు మలైయరసన్, టీఎం సెల్వగణపతి, సేలం కలెక్టర్ ఇరా బృందాదేవి, మాజీ శాసనసభ్యుడు ఎస్ఆర్ శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల ట్రయల్‌రన్...

సచివాలయం బయట జరిగిన కార్యక్రమంలో మహేంద్రా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తయారు చేసిన కొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ వాహనాలు ఎక్స్ఈవీ 9ఈ, బీఈ6 రకం లగ్జరీ కార్ల ట్రయల్‌రన్ ముఖ్యమంత్రి స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, టీఆర్‌బీ రాజా, మహేంద్రా సంస్థ సీనియర్ అధికారులు వేలుసామి, మదన్‌రాజ్, శక్తివేలన్, రాజాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ కొత్త భవనాల ప్రారంభం

సచివాలయంలో రాష్ట్ర కార్మిక సంక్షేమం, ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.27.33 కోట్లతో నిర్మించిన శ్రామికశాఖ కార్యాలయ భవనాలను, శిక్షణా కేంద్రాల భవనాలు, వసతి గృహభవనాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, సీవి గణేషన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, కార్మిక శాఖ సంచాలకులు అదనపు ప్రభుత్వ కార్యదర్శి అతుల్‌నాద్, కార్మిక సంక్షేమం ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖ కార్యదర్శి కె.వీరరాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పశుసంవర్ధక పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

గవర్నర్‌కు అహంకారం

సీనియర్ మంత్రి దురైమురుగన్ ధ్వజం

వాకింగ్ కోసమే ఆయన అసెంబ్లీ పర్యటన

ఉదయనిధి ఎద్దేవా

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారతదేశంపై, భారత రాజ్యాంగంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌కు నమ్మకంలేదని, ఆయనకు అహంకారం ఎక్కువని గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన ఆరోపణలపై సీనియర్ మంత్రి దురైమురుగన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి మండిపడ్డారు. వేలూరులో సోమవారం ఉదయం దురైమురుగన్ మీడియాతో మాట్లాడుతూ... దశాబ్దాలుగా శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ముందు తమిళ తల్లి ప్రార్థన, ప్రసంగం తర్వాత జాతీయ గీతం ఆలపించటం ఆనవాయితీ అని, దానిని తోసిరాజని తన ప్రసంగానికి ముందే జాతీయ గీతం ఆలపించాలని గవర్నర్ మొండిపట్టుపట్టడం గర్హనీయమన్నారు. తన ప్రసంగానికి ముందు జాతీయ గీతం ఆలపించరని ముందుగానే గవర్నర్‌కు తెలుసు కనుకనే జాతీయ గీతం పాడలేదన్న సాకుతో సభ నుండి నిష్క్రమించారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం ఎంతో హుందాగా వ్యవహరించారన్నారు. గవర్నర్ అసెంబ్లీని అవమానించడం చిన్నపిల్లాడి చేష్టలా ఉందని విమర్శించారని, రాజ్యాంగం ద్వారా వచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం ఇష్టం లేకుంటే రాజీనామా చేయాలని మాత్రమే కోరారని తెలిపారు. ఇంతమాత్రానికే ముఖ్యమంత్రికి అహంకారం ఎక్కువని గవర్నర్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవానికి ఆర్ఎన్ రవికి తాను గవర్నర్‌ననే అహంకారం ఉందని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి గవర్నర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ గవర్నర్ అసెంబ్లీకి వచ్చేది ప్రసంగం చేయడానికి కాదని, వాకింగ్ చేయడానికి మాత్రమేనని యెద్దేవా చేశారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 'చెన్నై సంగమం' సాంస్కృతిక మేళాను సోమవారం సాయంత్రం కీల్పాక్కం పెరియార్ ఈవేరా హైరోడ్డు సమీపంలోని ఏకాంబరనాథాలయ మైదానంలో ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. చిత్రంలో రాష్ట్ర మంత్రులు సుబ్రమణ్యం, స్వామినాథన్, ఎంపీ కనిమొళి తదితరులు



పుదుచ్చేరి మార్గంలో రోడ్డు ప్రమాదం

- కానిస్టేబుల్ సహా నలుగురి మృతి

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం - పుదుచ్చేరి మార్గంలోని మదగడిపట్టు ఫ్లైఓవర్‌పై రెండు కార్లు ఢీకొన్న ఘటనలో కానిస్టేబుల్‌తో సహా నలుగురు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా.. విల్లుపురం జిల్లా లింగారెడ్డి పాళెంకు చెందిన కదిరవన్ (52), పుదుచ్చేరి సరిహద్దులో మదగడిపట్టులో సెల్‌ఫోన్ దుకాణం నడుపుతున్నాడు. ఆదివారం రాత్రి ఆయన దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లేందుకు తన మిత్రుడు ముగిలన్ (37)తో కలిసి కారులో బయలుదేరారు. అదే విధంగా విల్లుపురం పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న చెన్నైకి చెందిన ప్రభాకరన్ (57) పుదువై జిప్మర్ ఆసత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు తన భార్య ఏంజల్ (57), బంధువుల కుమార్తె సింధు (12)తో కలిసి మరో కారులో బయలుదేరారు. కారును పానంపట్టు ప్రాంతానికి చెందిన చంద్రన్ (38) నడిపాడు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో మదగడిపట్టు ఫ్లైఓవర్‌పై వెళ్తుండగా, అటువైపు నుంచి ముగిలన్ నడిపిన కారు అదుపు తప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కధిరవన్, ముగిలన్, డ్రైవర్, ప్రభాకరన్ తీవ్రగాయాలతో సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. క్షతగాత్రులు ఏంజెల్, సింధులను విల్లుపురంలోని ముండియంపాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై త్రిభువనం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

శైవక్షేత్రాల్లో ఆరుద్ర దర్శన వేడుకలు

- రామనాథపురం, చిదంబరం సహా పలు ఆలయాల్లో పూజలు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో సోమవారం ఉదయం ఆరుద్రదర్శన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రామనాథపురం సమీపం మంగళనాథస్వామి ఆలయం, చిదంబరం నటరాజస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తిరుఉత్తరకోశమంగై గ్రామంలోని మంగళనాథస్వామి ఆలయంలో మరకత నటరాజస్వామివారిని దర్శించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివెళ్ళారు. మరకత నటరాజస్వామి విగ్రహం శబ్ద, వాయుకాలుష్యానికి గురై దెబ్బతినే అవకాశం ఉండటంతో యేడాదిపొడవునా ఆ విగ్రహాన్ని చందనతాపడం చేసి ఉంచుతారు. ఆరుద్రదర్శనం రోజు మాత్రమే చందన తాపడం తొలగించి నటరాజస్వామివారి నిజరూప దర్శనానికి భక్తులను అనుమతిస్తుంటారు. ఆ మేరకు సోమవారం ఉదయం ఆ నిజరూప దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. స్వామివారికి విశేషాభిషేకాలు, అభిషేకం, దీపారాధన నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం చందనతాపడం, ప్రత్యేక అలంకారం చేసి భక్తులను దర్శించేందుకు అనుమతించారు. సుమారు 500 మంది పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.





చిదంబరంలో ఆరుద్రదర్శనం కోసం వేచిఉన్న భక్తులు- ప్రత్యేక అలంకారంలో మరకత నటరాజస్వామివారు

చిదంబరంలో...

చిదంబరం నటరాజస్వామి ఆలయంలో ఆరుద్రదర్శన వేడుకలు సోమవారం ఉదయం కనులపండువగా జరిగాయి. ఈ ఆలయంలో యేడాదికి ఆరు మహా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. వీటిల్లో తమిళ ఆణి మాసంలో నిర్వహించే ఆణి తిరుమంజనం వేడుకల సందర్భంగా, ఆరుద్రదర్శనం సమయంలో నిర్వహించే మహా అభిషేకాలు ప్రత్యేకమైనవని శైవాగమ పండితులు, ఆలయనిర్వాహకులైన దీక్షితార్లు చెబుతారు. ఈ యేడాది ఆరుద్రదర్శన వేడుకలు ఈ నెల 4న ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో అత్యంత కీలకఘట్టమైన మహారథోత్సవం ఆదివారం ఉదయం ప్రారంభమై, రాత్రి 9 గంటలకు ముగిశాయి. సోమవారం ఉదయం ఆరుద్రదర్శనం సందర్భంగా శివకామసుందరి సమేత నటరాజస్వామివారికి వేకువజాము 3 నుండి ఉదయం 6 గంటల వరకు మహా అభిషేకం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు చిత్‌సభలో రహస్యపూజ, పంచమూర్తులు ఊరేగింపు, మధ్యాహ్నం వేయికాళ్లమండపంలో శివకామ సుందరి సమేత నటరాజస్వామి వారు కొలువుదీరి, అక్కడి నుండి బయలుదేరి నాట్యమాడుతూ ఆరుద్ర దర్శనమిచ్చి చిత్‌సభలో ప్రవేశించారు. . ఈ వేడుకల సందర్భంగా చిదంబరం నగరం భక్తులతో కిక్కిరిసిపోయింది. మంగళవారం ముత్యాలపల్లకీ ఊరేగింపు, బుధవారం పునర్నిర్మించిన జ్ఞానప్రకాశ తీర్థకొలనులో 22 యేళ్ల తర్వాత తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

సమాచార దర్శిని

26న 'త్యాగరాజ సంకీర్తనార్చన'

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన 'శ్రీవాణి' సంయుక్త నిర్వహణలో మల్లాది అనూష బృందంచే 'త్యాగరాజ సంకీర్తనార్చన' జరగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో సాయంత్రం 6.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వేదవిజ్ఞన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మధ్యాహ్నం వరకే రిజర్వేషన్ కేంద్రాలు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ రైల్వే పరిధిలోని రైల్వే రిజర్వేషన్ కేంద్రాలు మంగళవారం మధ్యాహ్నం వరకే పనిచేయనున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు రోజు కావడంతో, రిజర్వేషన్ కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు మాత్రమే పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

22 నుంచి జేఈఈ పరీక్షలు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి 30వ తేది వరకు జేఈఈ జరుగనున్నాయి. బీఈ, బీటెక్ కోర్సులకు ఈ నెల 22,23,24,28,29 తేదీలు, బీ-ఆర్క్, బి.ప్లానింగ్ తదితర కోర్సులకు 30వ తేది పరీక్షలు జరుగనున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని https://jeemain.nta.nic.in/, ఇతర వివరాలకు www.nta.ac.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

నేటినుంచి పక్షుల గణన

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం నుంచి ఈ నెల 17వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా పక్షుల గణన చేపట్టనున్నారు. ఉత్తర ధృవం చల్లగా ఉన్న సమయాల్లో, పక్షులు దక్షిణ ధృవం వైపు వస్తుంటాయి. అలా దేశానికి వచ్చే పక్షులు అధికంగా రాష్ట్రానికి చేరుకుంటాయి. ప్రతి ఏడాది అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ పక్షులు బస చేస్తుండగా, అటవీ శాఖ, ప్రైవేటు సంస్థలు పక్షుల గణన చేపడుతుంటాయి. ఈ క్రమంలో 'బర్డ్ కౌంట్ ఇండియా', 'ఇ బర్డ్' వెబ్‌సైట్ సంయుక్తంగా సంక్రాంతిని పురస్కరించుకొని పక్షుల గణన చేస్తుంటాయి. ఈ గణనలో పక్షుల ప్రేమికులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు www.birdcount.in/ అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

16న తిరుత్తణిలో విహరించనున్న మురుగన్

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలో ప్రతి ఏడాది కానుం పండుగ రోజున ఉత్సవమూర్తి మురుగన్ పెరిమాళ్, కొండ ఆలయం నుంచి మెట్ల మార్గంగా వేంచేసి, తిరుత్తణి నగర వీధుల్లో విహరిస్తుంటారు. ఈ ప్రకారం, ఈ నెల 16వ తేది సాయంత్రం 6 గంటలకు రెడ్డికుళం మండపంలో మురుగన్ పెరుమాళ్‌కు విభూది, పాలు, పంచామృతం, సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక అలంకరణలో ఎడ్ల బండిపై నగరంలో విహరించి, మళ్లీ రాత్రి 10 గంటలకు మురుగన్, కొండ ఆలయానికి వెళ్లనున్నారు.

బుక్ ఎగ్జిబిషన్‌లో రూ.20 కోట్ల మేర విక్రయాలు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై బుక్ ఎగ్జిబిషన్‌లో రూ.20 కోట్ల మేర పుస్తకాల విక్రయాలు జరిగాయని 'బబాసి' తెలిపింది. దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ముద్రణా సంస్థల అసోసియేషన్ (బబాసి) ఆధ్వర్యంలో 48వ పుస్తక ప్రదర్శన వైఎంసీఏ మైదానంలో 17 రోజులు జరిగి ఆదివారంతో ముగిసింది. ఈ ఎగ్జిబిషన్‌లో 900 స్టాల్స్ ఏర్పాటుచేశారు. సుమారు 20 లక్షల మంది సందర్శించగా, రూ.20 కోట్ల విక్రయాలు జరిగాయి. గత ఏడాది ఎగ్జిబిషన్‌లో రూ.18 కోట్ల విక్రయాలు జరుగగా, ఈ ఏడాది 10 శాతం అధికంగా విక్రయాలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు.

రూ.342 కోట్లతో సిప్కాట్ పార్క్

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మదురై-శివగంగ మధ్య ఇలుంబైకుడిలో కొత్తగా రూ.342 కోట్లతో సిప్కాట్ పార్క్ ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇలుంబైకుడి, కిలత్తూరి, అరసనూరు తదితర ప్రాంతాలను కలుపుతూ 775 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్ ఏర్పాటుకానుంది. ఇప్పటికే మదురైలో ఎల్కాట్ ఐటీ పార్క్ పనిచేస్తుంది. కొత్తగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఐటీ, ఆటోమొబైల్, టెక్స్‌టైల్స్ తదితర విడిభాగాల తయారీ సంస్థలతో ఏర్పాటుకానున్న ఈ పార్క్‌తో 36,500 మందికి ఉపాధి లభిస్తుందని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పొంగల్ బహుమతుల పంపిణీ పొడిగింపు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అవసరమైన పక్షంలో పొంగల్ బహుమతుల పంపిణీ అవకాశం పొడిగిస్తామని మంత్రి చక్రపాణి తెలిపారు. పొంగల్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పొంగల్ బహుమతుల పంపిణీ ఈ నెల 9న ప్రారంభమై సోమవారంతో ముగిసింది. సోమవారం వరకు 75 శాతం లోపే పొంగల్ బహుమతుల పంపిణీ జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, మిగిలిన కార్డుదారులకు పొంగల్ బహుమతి అందించే గడువు పెంపుపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి చక్రపాణి తెలిపారు.

వేలిముద్రలతో వివేకానందుడి చిత్రపటం

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో పాఠశాల విద్యార్థులు జాతీయ పతాకం రంగుల్లో బొటన వేలిముద్రతో స్వామి వివేకానంద చిత్రపటం రూపొందించి రికార్డు సాధించారు. స్వామి వివేకానంద జయంతి (జూన్ 12వ తేది) యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా విరుదునగర్ క్షత్రియ బాలికల మహోన్నత పాఠశాలల విద్యార్థినులు పాఠశాల ప్రాంగణంలో 635 చ.అ విస్తీర్ణంలో వివేకానందుడి చిత్రపటాన్ని బొటన వేలిముద్రలతో మూడు రంగుల్లో చిత్రీకరించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. ఇందుకోసం 8,9 తరగతులకు చెందిన 400 మంది విద్యార్థులు తన బొటన వేళ్లపై అక్రలిక్ రంగుల్లో ముంచి తెల్లటి ఫలకంపై జాతీయ జెండా రంగులు వేశారు. దాని మధ్యలో అశోక చక్రం ఉన్న చోట స్వామి వివేకానం చిత్రపటాన్ని అదే రంగుల్లో వేసి ప్రపంచ రికార్డ్‌లో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా సుమారు లక్షకు పైగా వేలిముద్రలతో విద్యార్థులు ఈ చిత్రం రూపొందించారు.



విద్యార్థులు వేలిముద్రలతో రూపొందించిన చిత్రం

ఉద్యోగం పేరిట మహిళకు వేధింపులు
ప్రభుత్వ అధికారి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పిస్తానంటూ మహిళను లైంగిక వేధింపులకు గురిచేసిన ప్రభుత్వ అధికారి కటకటాల పాలయ్యాడు. సేలం జిల్లాకు చెందిన ఓ యువతి తండ్రి పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తూ మృతిచెందారు. తనకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం ఇప్పించాలంటూ మున్సిపాలిటీ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న దేవరాజన్‌ను సంప్రదించింది. ఆ యువతితో తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడే దేవరాజన్ ఆమెను లైంగికంగా వేధించినట్లు తెలిసింది. దేవరాజన్ తనతో సెల్‌ఫోన్‌లో మాట్లాడినదంతా రికార్డు చేసిన యువతి, సేలం నగర మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై విచారించిన పోలీసులు, దేవరాజన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కోవై బీజేపీ కార్యాలయంపై 'బీఫ్' వేసే యత్నం
ఐదుగురి అరెస్ట్

ఐసిఎఫ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోని బీజేపీ కార్యాలయంపై 'బీఫ్' వేసేందుకు యత్నించిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోవై ఉడయాంపాళయం వీరమాత్తి అమ్మన్ ఆలయం సమీపంలో, తోపుడు బండిపై బీఫ్ బిర్యానీ నడుపుతున్న నేపథ్యంలో, స్థానిక బీజేపీ నేత సుబ్రమణియన్ అభ్యంతరం తెలిపారు. దుకాణ యజమానురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు బాలసుబ్రమణియన్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో, బీజేపీ కార్యాలయంపై బీఫ్ వేసేందుకు సోమవారం ఉదయం ఆది తమిళర్ పార్టీకి చెందిన కార్యకర్తలు యత్నించారు. దీంతో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదాలపై వినూత్న అవగాహన



పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ నగర పోలీసులు రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు వినూత్న అవగాహన ప్రచారం చేపడుతున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమంలో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే ఏర్పడే ప్రమాదాలు, అతివేగంగా వెళ్తూ ప్రమాదం, మద్యం సేవించి నడపడం, హెల్మెట్ ధరించకపోవడంతో ఏర్పడే ప్రమాదాలు తదితరాలపై మాక్ డ్రిల్‌గా చేసి చూపుతున్నారు. ప్రమాదంలో వ్యక్తులు మృతిచెందడం, బంధువులు రోధించడం తదితరాలను కళ్లకు కట్టినట్లు చేసి చూపుతుండడం ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

ఈరోడ్ ఉప ఎన్నిక...
12 మంది నామినేషన్ల దాఖలు



ఈరోడ్ తూర్పు ప్రవేశద్వారంలో సరిహద్దు బోర్డు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ తూర్పు శాసనసభ ఉప ఎన్నిక కోసం సోమవారం వరకు 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ మృతిచెందిన నేపథ్యంలో, ఫిబ్రవరి 5వ తేది ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ఈ నెల 10న ప్రారంభమై 17వ తేది వరకు జరుగనుంది. ఆ ప్రకారం, నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై తొలిరోజు ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. శని, ఆదివారం సెలవు రోజులు కావడంతో సోమవారం నామినేషన్ల స్వీకరణ జరిగింది. ఇప్పటివరకు నామినేషన్లు వేసిన వారి సంఖ్య 12కు చేరింది. పొంగల్ సందర్భంగా బుధవారం నుంచి 16వ తేది వరకు సెలవులు కాగా, 17న నామినేషన్ల సమర్పణకు చివరి రోజు. 18న నామినేషన్ల పరిశీలన, 20వ తేది ఉపసంహరణ, ఆ రోజు సాయంత్రం పోటీచేసే తుది అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 5వ తేది పోలింగ్, 8వ తేది సిత్తోడు ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఈ నేపథ్యంలో, డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్ 17వ తేది నామినేషన్ వేయనున్నట్లు ప్రకటించగా, నామ్ తమిళర్ పార్టీ తరఫున ప్రకటించనున్న అభ్యర్థి కూడా ఆ రోజే నామినేషన్ వేసే అవకాశముంది. కాగా, ఈరోడ్ తూర్పు ఉప ఎన్నికను ప్రతిపక్ష అన్నాడీఎంకే, ఆ పార్టీ మిత్రపక్షమైన డీఎండీకే, బీజేపీ పార్టీలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

ఉప ఎన్నికకు బీజేపీ దూరం ...

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికను ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, దాని మిత్రపక్షం డీఎండీకే బహిష్కరించిన నేపథ్యంలో బీజేపీ కూడా అదేబాట పట్టింది. తాము కూడా ఆ నియోజకవర్గంలో పోటీచేయడం లేదని ప్రకటించింది. ఇదిలా ఉండగా ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో పోటీకి దిగాలని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం పావులు కదుపుతున్నట్లు తెలిసింది. బీజేపీ జాతీయ నాయకులతో తనకున్న పలుకుబడిని ఉపయోగించి ఆ దిశగా ప్రయత్నాలు కూడా ప్రారంభించారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

23న విద్యార్థులకు పోటీలు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తమిళ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చెంగల్పట్టు రాజేశ్వరి వేదాచలం ప్రభుత్వ కళాశాలలో ఈ నెల 23న విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ విడుదల చేసిన ప్రకటనలో.. ఉదయం 9 గంటల నుంచి ప్లస్ వన్, ప్లస్ టూ పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు కవితలు, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ సిఫారసు లేఖతో హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు.

టీసీడబ్ల్యూఐ సర్వేలో గ్రేటర్ చెన్నైకి స్థానం

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): టాప్ సిటీస్ ఉమెన్ ఇండియా (టీసీడబ్ల్యూఐ) సర్వేలో సోషల్, ఇండస్ట్రియల్ ఇన్‌క్లూజిన్ ఇన్డెక్స్‌లోని మొదటి మూడు నగరాల్లో గ్రేటర్ చెన్నైకు రెండో స్థానం దక్కింది. భారతదేశంలో మహిళల కోసం అగ్ర నగరాలు సూచిక 3వ ఎడిషన్‌లో తమిళనాడు ఆధిపత్యం కొనసాగింది. ఇటీవల విడుదలైన సర్వేలో టాప్ 25లో చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి, మదురై, వేలూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ నగరాలకు చోటుదక్కినట్లు అవతార్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సౌందర్య ఓ ప్రకటన విడుదల చేశారు. అవకాశాలకు నగరాలు పునాదులని, అలాంటి నగరాల్లో స్త్రీలు ఎలా జీవిస్తారో, పనిచేస్తారో, అభివృద్ధి ఎలా చెందులతాలనేది ముఖ్యమని ఆమె తెలిపారు. 2047నాటికి వికసిత భారత్ కలను సాకారం చేసుకోవడానికి,పురుషులతో సమానంగా విజయంసాధించడానికి భారతీయ మహిళా నిపుణులు అవసరమన్నారు. దేశంలో మహిళల కోసం ప్రధాన నగరాలు, రోల్‌మోడల్ నగరాలను బట్టి ఉత్తమ అభ్యాసాలను గుర్తిస్తుందన్నారు. అవతార్ పరిశోధనలో 2024 ఫిబ్రవరి నుంచి నవంబరు వరకు దేశవ్యాప్తంగా 60 నగరాల్లో సర్వే నిర్వహించామని, అందులో తొలి ఐదు స్థానాలలో చెన్నైకు చోటు దక్కిందని ఆమె తెలిపారు.

తీరప్రాంతానికి తాబేళ్ల కళేబరాలు



తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు కళేబరం

ఐసిఎఫ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సముద్ర తీరప్రాంతాలకు ఒక్కొక్కటిగా 37 తాబేళ్ల కళేబరాలు కొట్టుకురావడంపై జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెమ్మేలికుప్పం తీర ప్రాంతంలో సుమారు కి.మీ వరకు 20 తాబేళ్లు మృతిచెంది తీరానికి కొట్టుకొచ్చాయి. అలాగే, ఇంజంబాక్కం ప్రాంతంలోనూ 8 తాబేళ్ల కళేబరాలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో అప్పుడప్పుడు తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్న నేపథ్యంలో, కొద్దిరోజులుగా ఎక్కువ కావడంపై కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెమ్మేలికుప్పం ప్రాంతంలో నిర్లవణీకరణ కేంద్రం పనుల కోసం ఏర్పాటుచేసిన దిమ్మెల వల్ల తాబేళ్లు మృతిచెంది ఉంటాయని అటవీ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. జాలర్ల వలలో చిక్కుకొని కూడా తాబేళ్లు మృతిచెంది ఉండొచ్చని, అటవీ శాఖ సిబ్బంది ఈ విషయమై జాలర్ల తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక జాగిలాలు

● డీజీపీ శంకర్‌జివాల్



టి.నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్మగ్లర్లు దాచిన మాదక ద్రవ్యాలను గుర్తించేందుకు రాష్ట్రపోలీసు శాఖలో ప్రత్యేక జాగిలాల విభాగాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామని డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమరవాణా, అమ్మకాలను నిరోధించడానికి పోలీసు శాఖ పలు చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. వీటిలో ప్రధానంగా మాదక ద్రవ్యాల వ్యాపారులను అరెస్టు చేస్తున్నామని, 2023లో మాదక ద్రవ్యాలకు సంబంధించిన 10,256 కేసులు నమోదు చేసి 14,770 మందిని అరెస్టు చేసి, వారి నుంచి కోట్ల విలువైన గంజాయి, మత్తుమాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇదే విధంగా గతేడాది 6054 కేసులు నమోదు చేసి, 9731 మందిని అరెస్టు చేశామని వారి స్థిరాస్థులు, చరాస్థులను స్వాధీనం చేసుకుని జప్తు చేశామన్నారు. అదే విధంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించే దిశగా ప్రజల మధ్య మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలను సేవించడం వల్ల కలిగే అనర్థాలను తెలిపేలా ప్రజల మధ్య అవగాహన ప్రచార కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో 20 వేలకు పైగా బృందాలను ఏర్పాటు చేసి, పోలీసుశాఖ, ఆహారభద్రతా శాఖ, మందుల నిరోధక విభాగం (డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్)తో కూడిన 391 ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు డీజీపీ వివరించారు. ఈ బృందాలు అన్ని విద్యాసంస్థల సమీపాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. మాదక ద్రవ్యాల నిల్వలను కనుగొనేందుకు పోలీసులకు సాయపడేలా రాష్ట్ర పోలీసు శాఖలో కొత్తగా ప్రత్యేక జాగిలాల బృందాన్ని (నర్కోటిక్ స్నిఫర్ డాగ్స్ స్క్వాడ్) ఏర్పాటు చేయనున్నామని ఆయన ప్రకటించారు.

కొత్త చట్టాలపై ప్రజాభిప్రాయ సేకరణ

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధించి ప్రజలు 15 రోజుల్లో తమ అభిప్రాయాలు తెలియజేయాలని మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎం.సత్యనారాయణ నేతృత్వంలో ఏకసభ్య కమిటీ ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ కొత్త క్రిమినల్ చట్టాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో పేరు మార్పుతో పాటు ఎలాంటి సవరణలు అవసరం అనే విషయాన్ని ప్రజల నుంచి తెలుసుకొనేందుకు కమిటీ ఏర్పాటైంది. ఈ చట్టాలు పరిశీలించి ఎలాంటి సవరణలు చేయాలి అనే విషయమై అభిప్రాయాలను తెలియజేయాలని కమిటీ ఛైర్మెన్ సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కేవీ పాఠశాల పరీక్షలు వాయిదా

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సెలవుల్లో జరపాల్సిన పరీక్షలను వాయిదావేసినట్లు కేవీ పాఠశాల యాజమాన్యం ప్రకటించింది. చెన్నై, తిరుచ్చి, మదురై తదితర ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయాల్లో ఈ నెల 13,16,17,18 తేదీల్లో 6 నుంచి 11వ తరగతి వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పొంగల్ సెలవు రోజుల్లో కేవీ పాఠశాల పరీక్షల నిర్వహించడంపై మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ తన ఎక్స్ పేజీలో నిరసన తెలిపారు. ఈ క్రమంలో, ఈనెల 13 నుంచి 16వ తేది వరకు ఎలాంటి పరీక్షలు నిర్వహించడం లేదని పాఠశాల యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనపై ఎంపీ వెంకటేశన్ 'విజ్ఞప్తిపై స్పందించి సత్వరం ఈ మార్పులు చేపట్టిన కేంద్రీయ విద్యాలయం నిర్వాహకులకు కృతజ్ఞతలు, విద్యార్థులకు పొంగల్ శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

భారీగా పెరిగిన పూల ధరలు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోయంబేడు మార్కెట్లో పూల ధరలు ఏడు రెట్లు పెరిగాయి. సాధారణ ధరల కన్నా వైకుంఠ ఏకాదశి రోజున 4 రెట్లు పెరిగిన పూల ధరలు, సంక్రాంతి సందర్భంగా ఏడు రెట్లు పెరిగాయి. పండుగ కోసం పూజా సామగ్రి కొనుగోలుకు సోమవారం తెల్లవారుజాము నుంచే మార్కెట్‌కు ప్రజలు పోటెత్తారు. దీంతో, పూల ధరలు ఒక్కసారిగా వ్యాపారులు పెంచేలారు. మల్లెపూలు కిలో రూ.2,600 నుంచి రూ.3,000, ఐస్ మల్లెలు రూ.2,000-రూ.2,500, ముల్లై రూ.1,400-రూ.2,100, జాజిమల్లె రూ.1,000-రూ.1,800, కనకాంబరాలు రూ.1,400-రూ.1,500, ఆరళి పూలు రూ.200- రూ.500, చామంతి రూ.160-రూ.180, సంపంగి రూ.180-రూ.250, పన్నీర్ రోజ్ రూ.160-రూ.180, చాక్లెట్ రోజ్ రూ.150-రూ.280 ధర పలికాయి.

రెండో రాజధానిగా తిరుచ్చి



తమిళర్ దేశం కట్చి కార్యాచరణ మండలి సమావేశంలో పాల్గొన్న పార్టీ అధ్యక్షుడు సెల్వకుమార్ తదితర నాయకులు

● తమిళర్ దేశం కట్చి తీర్మానం

టి.నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరాన్ని రాష్ట్రానికి రెండో రాజధానిగా ప్రకటించాలని కోరుతూ తమిళర్ దేశం కట్చి రాష్ట్ర కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. దిండుగల్‌లో జరిగి ఆ పార్టీ కార్యాచరణ కమిటీ సమావేశంలో ఓ తీర్మానాన్ని ఆమోదించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పార్టీ అధ్యక్షుడు సెల్వకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి అళగర్, ప్రధాన కార్యదర్శి దళవాయ్ రాజేష్, వ్యవస్థాపక కార్యదర్శి మగిటేశ్వరన్, గురు మణికంఠన్ తదితరులు పాల్గొన్నారు. కులాలవారీ గణన జరిపి ముత్తరాయర్ కులస్థులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని, రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని, టంగ్‌స్టన్ తవ్వకాలను కేంద్రం ఉపసంహరించుకోవాలని, తమిళజాలర్లపై శ్రీలంక దాడులను అడ్డుకునేలా శాశ్వతమైన చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ పలు తీర్మానాలు చేసి ఆమోదించారు.



సోమవారం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకుని ఫెంగల్ తుఫాన్ బాధితుల సహాయార్థం తన నెల వేతనాన్ని విరాళంగా అందజేస్తున్న స్పీకర్ అప్పావు

17 వరకు మెట్రోరైలు వేళల్లో మార్పులు

వాషర్‌మెన్‌పేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా మంగళవారం నుంచి ఈ నెల 16వ తేది వరకు ఆదివారం టైంటేబుల్, 17వ తేది శనివారం టైంటేబుల్ ప్రకారం మెట్రోరైళ్లు నడుపనున్నారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 10 నిమిషాలకు ఒక రైలు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిముషాలకు ఒక రైలు నడుపనున్నారు.

17వ తేది..: ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 6 నిమిషాలకు ఒక రైలు, ఉదయం 5 నుంచి 8 గంటలు, 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిముషాలకు ఒక రైలు నడుస్తాయని సీఎంఆర్‌ఎల్ తెలిపింది.

షార్జాకు కోవై జిల్లా చెరకు ఎగుమతి

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోవై నుంచి విమానం ద్వారా రెండు రోజుల్లో రెండు టన్నుల చెరకు ఎగుమతి అయ్యాయి. కోవై విమానాశ్రయం నుంచి సింగపూర్, షార్జా, అబుదాబి తదితర విదేశాలకు విమానాశ్రయాలు నడుపుతున్నారు. ఇందులో కోవై - షార్జా మధ్య వారంలో ఐదు రోజులు విమానాలు నడుపుతున్నారు. కోవై విమానాశ్రయం నుంచి సుమారు మూడు టన్నులకు పైగా సరుకులను విదేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ నేపథంమంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విమానంతో షార్జాకు చెరకు గడలు ఎగుమతి చేసారు. దీనిపై ఆ విమానాశ్రయ అధికారులు మాట్లాడుతూ, ఇక్కడి నుంచి సింగపూర్‌కు ప్రతి రోజు టన్ను సరుకులు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. అబుదాబి విమానంలో తక్కువ సరుకులను మాత్రమే అనుమతిస్తున్నామన్నారు. అయితే షార్జా విమానాల్లో పూలు, పండ్లు ఆటోమొబైల్స్ విడిభాగాలు, ధాన్యం, తదితరాలను ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా శని, ఆదివారాల్లో మదురై, దిండుగల్, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్కున్న 2టన్నుల చెరకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు.

తిరుచెందూరు తీరంలో ప్రాచీన విగ్రహాలు లభ్యం



సముద్రతీరంలో ఇసుకలో లభ్యమైన మునీశ్వరుడు, నాగదేవత విగ్రహాలు

టి.నగర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు ఆలయం సమీపంలోని సముద్రతీరంలో రెండు శతాబ్దాల నాటి ప్రాచీన మునీశ్వరుడు, నాగదేవత విగ్రహాలు బయల్పడ్డాయి. ఇటీవలి కాలం అక్కడి సముద్రతీరంలో తరచూ సముద్రం వెనక్కి వెళ్తోంది. ఈ నేపథ్యంలో సముద్రతీరంలోని ఇసుకలో ఈ రెండు విగ్రహాలు సోమవారం లభ్యమయ్యాయి. మునీశ్వరుడి విగ్రహం, పక్కనే నాగదేవత విగ్రహం లభించింది. ఈ రెండు విగ్రహాలు సుమారు 200ల సంవత్సరాలనాటిదని ఆలయ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విగ్రహాలను రాష్ట్ర దేవాదాయ శాఖకు అప్పగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

చిన్నారిపై లైంగిక వేధింపులు: బీజేపీ నేత అరెస్ట్



పోక్సో చట్టం కింద అరెస్టయిన బీజేపీ నేత ఎంఎస్.షా

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మదురైలో 15 ఏళ్ల బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన బీజేపీ రాష్ట్ర నేత ఎంఎస్.షాను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. బాధితురాలి తండ్రి మదురై పోలీసులకు ఇచ్చి ఫిర్యాదులో రాష్ట్ర బీజేపీ ఆర్థిక విభాగం అధ్యక్షుడిగా ఉన్న ఎంఎస్.షా తమ కుమార్తె సెల్ ఫోన్‌కు అసభ్య చిత్రాలు పంపించి లైంగిక వేధింపులకు గురిచేశాడని ఆరోపించారు. తన భార్య కూడా షాకు సహకరించిందని ఫిర్యాదులో తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఎంఎస్‌షా బాలిక తల్లిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో షాను సోమవారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచి, రిమాండ్‌కు తరలించారు.

డ్యూటీలో ఇతరుల జోక్యం తట్టుకోలేక రాజీనామా
హోం సెక్రటరీకి లేఖ పంపిన సీఐ



సీఐ శరవణన్

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పదహారేళ్లుగా నిజాయితీ అధికారిగా పేరు తెచ్చుకున్న తనకు ఇటీవలి కాలంలో తన విధుల్లో ఇతరుల జోక్యం అధికమైందని, స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్ తనకు తెలియకుండా సిబ్బందికి పనులు అప్పగిస్తున్నారని ఆరోపిస్తూ రామనాథపురం జిల్లా ఆర్ఎస్ మంగళంసీఐ ఆర్.శరవణన్ ఆరోపించారు. అంతటితో ఆగకుండా తన విధులలో ఇతరుల జోక్యం గురించి ప్రస్తావించి, రాజీనామా లేఖను రాష్ట్ర హోంశాఖ కార్యదర్శికి పంపించారు. బాధ్యతాయుతమైన విధులను నిర్వర్తించడంలో కిందిస్థాయి ఉద్యోగులే అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తున్న కారణంగా తాను విధుల నుండి తప్పుకోవడం మినహా మరో మార్గం లేక పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీఐ శరవణన్ హోం శాఖ కార్యదర్శికి పంపిన లేఖలో స్పష్టం చేశారు.

తమిళ్‌మగన్ హుసేన్‌కు అస్వస్థత



చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్ తీవ్ర అస్వస్థతకు గురై తిరుచ్చి సమీపం శ్రీరంగంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. తిరుచ్చిలోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు చెన్నైనుంచి ఆయన రైలులో బయలుదేరి వెళ్లారు. సోమవారం వేకువజామున తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో దిగగానే ఆయన తీవ్రజ్వరంతో అస్వస్థతకు గురయ్యారు. పార్టీ స్థానిక నాయకులు ఆయన్ని వెంటనే చికిత్స నిమిత్తం శ్రీరంగంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యనిపుణులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు.



సోమవారం చెన్నై కోయంబేడు మార్కెట్ వద్ద ఏర్పాటైన పొంగల్ సంతను అధికారులతో కలిసి తనిఖీ చేస్తున్న సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు

హిట్ కాంబినేషన్‌లో మరో చిత్రం

జాతీయ అవార్డు గ్రహీతలు దర్శకుడు వెట్రిమారన్, హీరో ధనుష్ కాంబినేషన్ హిట్ కాంబోగా గుర్తింపుపొందింది. వీరిద్దరి కలయికలో మరో చిత్రం రానుంది. దీనికి సంబంధించి సోమవారం అధికారికంగా ప్రకటన వచ్చింది. గతంలో వీరిద్దరి కాంబోలో 'పొల్లాదవన్', 'ఆడుగలం', 'వడ చెన్నై', 'అసురన్' వంటి హిట్ చిత్రాలు రాగా, మరోమారు కలిసి పనిచేయనున్నారు. ప్రముఖ నిర్మాత ఎల్రెడ్ కుమార్ ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ పతాకంపై నిర్మించనున్నారు. అలాగే, 'విడుదలై' మూవీతో హీరోగా అవతారమెత్తిన కమెడియన్ సూరితో కూడా నిర్మాత ఎల్రెడ్ కుమార్ మరో చిత్రాన్ని నిర్మించనున్నారు. వెట్రిమారన్ - సూరి - విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వచ్చిన 'విడుదలై-1', 'విడుదలై-2' చిత్రాలు ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఈ విజయాలను అందించిన ప్రేక్షకులకు, మీడియాకు ధన్యవాదాలు తెలిపిన నిర్మాత ఎల్రెడ్.. పొంగల్ శుభ సందర్భంగా తమ తదుపరి చేపట్టే రెండు ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. ఇందులో ఒక చిత్రం వెట్రిమారన్ - ధనుష్‌తో నిర్మించనుండగా, మరో చిత్రాన్ని సూరి - డైరెక్టర్ మదిమారన్ పుగళేంది కాంబోలో రూపుదిద్దుకోనుంది. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడించనున్నట్టు ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.


వెట్రిమారన్ - ధనుష్

సూర్య సరసన ఐశ్వర్య?

హీరో సూర్య సరసన మలయాళ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి అవకాశం దక్కించుకునేలా ఉంది. 'పొన్నియిన్ సెల్వన్', 'గట్టాకుస్తీ' వంటి హిట్ చిత్రాల్లో ఆమె నటించారు. దీంతో వెట్రిమారన్ దర్శకత్వంలో సూర్య నటించే చిత్రంలో ఐశ్వర్య లక్ష్మిని హీరోయిన్‌గా ఎంపిక చేసేందుకు సంప్రదిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం హీరో సూర్య డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'రెట్రో' మూవీలో నటిస్తుండగా, ఈ సినిమా మే ఒకటో తేదీ విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు. ఆ తర్వాత ఆర్జే బాలాజీ దర్శకత్వంలో 'పేట్టైకారన్' అనే మూవీలో సూర్య నటించనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత 2020లో ప్రారంభించిన 'వాడివాసల్' మూవీని సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు. ఈ సినిమాకు వెట్రిమారన్ దర్శకుడు. సి.సు.చెల్లప్ప రచించిన 'వాడివాసల్' అనే నవల ఆధారంగా ఈ సినిమాను రూపొందించనున్నారు. జల్లికట్టు క్రీడా నేపథ్యంలో కొనసాగనుంది. ఈ మూవీ కోసం ఐశ్వర్య లక్ష్మిని హీరోయిన్‌గా తీసుకోవాలని భావిస్తున్నారు.


ఐశ్వర్య లక్ష్మి

తమిళ చిత్రజ్యోతి

'లవ్ యూ అజిత్'

● రజనీ అభినందనలు



దుబాయ్ వేదికగా జరుగుతున్న 24హెచ్ కార్ రేసింగ్ పోటీల్లో కోలీవుడ్ అగ్రహీరో అజిత్‌కుమార్ జట్టు విజయం సాధించింది. దీంతో సూపర్‌స్టార్ రజనీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ సహా అనేక మంది సినీ ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ విషయంపై రజనీకాంత్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'నా ప్రియమైన అజిత్‌కు అభినందనలు. మీరు సాధించారు. దేవుడు ఆశీర్వదించారు. లవ్ యూ' అంటూ పేర్కొన్నారు. అలాగే, ఈ పోటీలను తిలకించేందుకు దుబాయ్‌కు వెళ్ళిన నటులు ఆర్.మాధవన్, అర్జున్ దాస్, ఆరవ్, వసంత్ రవి, దర్శకులు విష్ణు వర్ధన్, ఆధిక్ రవిచంద్రన్ స్వయంగా అజిత్‌ను కలిసి అభినందించారు. అలాగే, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా అజిత్‌ను అభినందిస్తూ ట్వీట్ చేశారు. 'అజిత్ కుమార్, అతని జట్టు తృతీయ స్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ అద్భుతమైన విజయం సాధించిన అజిత్‌కు, ఆయన బృందానికి అభినందనలు. మన దేశం, రాష్ట్రం గర్వించేలా మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

యావత్ రాష్ట్రం తిరిగి చూసేలా భవనం

● ప్రధాన కార్యదర్శి విశాల్


నిర్మాణంలో ఉన్న నడిగర్ సంఘం భవనం



కొన్ని నెలల్లో యావత్ తమిళనాడు రాష్ట్రం తిరిగి చూసేలా నడిగర్ సంఘం భవనం ఉంటుందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి హీరో విశాల్ అన్నారు. టి.నగర్‌లోని నడిగర్ సంఘం కార్యాలయంలో పొంగల్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో సంఘం అధ్యక్షుడు నాజర్‌తో కలిసి విశాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు విశాల్ సమాధానమిస్తూ, 'మరో నాలుగు నెలల్లో యావత్ రాష్ట్రం తిరిగిచూసేలా ఇక్కడ ఒక భవనం రాబోతుంది. ఇందులో అద్భుతమైన ఆడిటోరియం ఉంటుంది. ఈ భవన నిర్మాణానికి తీవ్రజాప్యం నెలకొనడం వెనుక ఏదో ఒక కారణం ఉండివుంటుంది. దేవుడు ఒక దారి చూపితేనే అది సాధ్యమవుతుంది. ఇపుడు ఆ దేవుడి ఆశీర్వాదంతోనే ఈ భవనం పూర్తికానుంది. చెన్నై నగరానికి ఇతర ప్రాంతాల వారు వచ్చినపుడు మెరీనా తీరంలో ఉన్న ఎంజీఆర్ సమాధిని ఏ విధంగా అయితే చూడటానికి ఇష్టపడతారో అలాగే, నడిగర్ సంఘం భవనాన్ని కూడా చూసి వెళ్ళేలా అనిపించేలా నిర్మాణం ఉంటుంది' అని పేర్కొన్నారు. గత కొంతకాలంగా ఆగిపోయిన నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి.


పొంగల్ వేడుకల్లో తమిళిసై తదితరులు

గవర్నర్, సీఎం స్నేహపూర్వకంగా మాట్లాడుకోవాలి

● తమిళిసై

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గవర్నర్, ముఖ్యమంత్రి స్నేహపూర్వకంగా కూర్చొని మాట్లాడుకోవాలని రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ ఆశాభావం వ్యక్తం చేశారు. సాలిగ్రామంలో సోమవారం జరిగిన పొంగల్ వేడుకల్లో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడుతూ... డీఎంకేతో యుద్ధానికి బీజేపీ సిద్ధంగా లేదన్నారు. యుద్ధభూమిలో డీఎంకే నిజాయితీగా వ్యవహరించదని, వెన్నుపోటు ఆ పార్టీ లక్ష్యమన్నారు. ప్రస్తుతం సీమాన్ వ్యక్తం చేస్తున్న ప్రతి అభిప్రాయం దీర్ఘకాలంగా బీజేపీ చెబుతున్న విషయాలని ఆమె పేర్కొన్నారు.

టీటీడీ శ్రీవారి ఆలయంలో వైభవంగా గోదా కల్యాణోత్సవం


గోదా రంగనాథుల కల్యాణ శోభ


గోదా కల్యాణోత్సవంలో పాల్గొన్న స్థానిక సలహామండలి మాజీ సభ్యులు ఆనంద్‌కుమార్‌రెడ్డి, కృష్ణారావు తదితరులు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ టీటీడీ దేవస్థానం వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శూడికొడుత్త నాచ్చియార్‌గా కీర్తిగడించిన గోదాదేవి పరిణయోత్సవం సోమవారం ఉదయం నేత్రపర్వంగా జరిగింది. శ్రీవిల్లిపుత్తూరులోని పెరియాళ్వార్ విష్ణుచిత్తుడి కుమార్తె గోదాదేవి (ఆండాళ్) 30 రోజులపాటు కాత్యాయని వ్రతమాచరించి, మానవాళికి 'తిరుప్పావై' పేరుతో పాశురాలను అందించి, శ్రీరంగనాథుడిలో ఐక్యమొందిన రోజు కావటం విశేషం. గోదాదేవి ఆవిర్భావ స్థలం శ్రీవిల్లిపుత్తూరులో ఆ వివాహ వేడుకలను చూడటానికి వేయి కనులు చాలవనటం అతిశయోక్తి కాదు. ఇంతటి విశేషాలతో కూడుకున్న గోదా కళ్యాణోత్సవాన్ని టీటీడీ నిర్వాహకులు టీ నగర్ ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని అలంకరించారు. గోదాదేవి (ఉత్సవమూర్తి)ని కూడా అలంకరించి తిరుకల్యాణోత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షులు ఆనంద్‌కుమార్ రెడ్డి, మాజీ సభ్యులు వీవీఆర్ కృష్ణారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరువారూర్‌కు పోటెత్తిన భక్తులు


దర్శనానికి క్యూలైన్లలో వేచివున్న భక్తులు

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్‌లో ప్రసిద్ధి చెందిన త్యాగరాజస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన పాద దర్శనం, మహా దీపారాధన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. సంగీత ముమ్మూర్తుల్లో ఒకరైన త్యాగరాజస్వామి ఆలయంలో తిరువాదిరై ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి త్యాగయ్యకు మహా అభిషేకం, సోమవారం తెల్లవారుజామున నటరాజస్వామి వార్లకు అభిషేకాలు జరిపి, పతంజలి, మునివర్లు, త్యాగరాజస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు కుడిపాదం దర్శనానికి క్యూలైన్ల ద్వారా అనుమతించారు. ఈ సందర్భంగా శివకామ సుందరి సమేత నటరాజ స్వామి ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించి, తిరువారూర్ త్యాగరాజస్వామి ఆలయ మహా మండపానికి తరలించారు. ఆలయం బయట రెండు కిలోమీటర్ల మేర భక్తులు బారులుదీరి పాదదర్శనం చేసుకున్నారు. జిల్లా యంత్రాంగం త్రాగునీరు, మరుగుదొడ్లు సహా వివిధ శాఖల తరుపున మౌళిక సదుపాయాలు కల్పించారు. 300 మందికి పైగా పోలీసులు భద్రత విధుల్లో పాల్గొన్నారు.


రైళ్లలో ప్రయాణికుల రద్దీ

రైళ్లలో రద్దీ...

సొంతూళ్లకు 20 లక్షల మంది

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ కోసం రాజధాని నగరం నుంచి రైళ్ల ద్వారా 20 లక్షల మందికి పైగా సొంతూళ్లకు వెళ్లారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు సొంతూళ్లలో గడిపేందుకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం 6 రోజులు వరుస సెలవులు ప్రకటించింది. దీంతో ఈ సంవత్సరం పొరుగూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగింది. ఈ నెల 10వ తేదీ నుంచి సోమవారం వరకు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా 44,580 బస్సులు నడిపాయి. మరోవైపు నగరం నుంచి ప్రతి రోజు నడిపే 10,460 బస్సుతో పాటు అదనంగా 5,290 ప్రత్యేక బస్సులు నడిపారు. ఆదివారం వరకు నడిపిన 11,463 ప్రభుత్వ బస్సుల్లో దాదాపు 6 లక్షల మంది ప్రయాణించగా, ఆదివారం ఒకే రోజు 2.17 లక్షల మంది ప్రయాణం చేశారు. ఆమ్నీ బస్సుల్లో గత మూడు రోజుల్లో 1.90 లక్షల మంది ప్రయాణం చేయగా, సోమవారం 60 వేల మంది రిజర్వేషన్ చేసుకున్నారు. ఇవి కాకుండా ప్రవేటు టూరిస్ట్ వాహనాలు, ఆమ్నీ బస్సుల్లో కూడా ప్రజలు స్వస్థలాలకు బయలుదేరారు. అదే విధంగా 10వ తేదీ నుంచి 13 వరకు రైళ్లలో దాదాపు 20 లక్షల మందికి పైగా ప్రయాణించారు. పండుగ జరుపుకొనేందుకు సుమారు 38 లక్షల మందికి పైగా సొంతూళ్లకు వెళ్లడంతో, ఎప్పుడూ రద్దీగా కనిపించే చెన్నై మహానగరంలో జన సంచారంలో పాటు వాహనాల రాకపోకలు కూడా తగ్గిపోవడం గమనార్హం.


సచివాలయం వెలుపల మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ కొత్త ఎలక్ట్రిక్ లగ్జరీ కార్ల ట్రయల్ రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

నటరాజస్వామి నుదుటిపై మహాదీప అంజనం



వేలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో సోమవారం ఆరుద్ర దర్శన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం 4 గంటలకు నటరాజస్వామికి అభిషేకాలు, మహా దీపారాధన నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వెయ్యి కాళ్ల మండపంలో స్వామివారిని నుదుటను మహాదీపం అంజనం ఉంచారు. ఈ అంజనాన్ని మహా దీపం వెలిగించేందుకు నెయ్యి విరాళంగా ఇచ్చిన భక్తులకు అందజేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వేడుకగా 'అయ్యనోర్ అమ్మనోర్' ఉత్సవం


సాంప్రదాయ నృత్యం చేస్తున్న చిన్నారులు

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోతగిరిలో కోథార్ ఆదివాసీలు 'అయ్యనోర్ అమ్మనోర్' ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. నీలగిరి జిల్లాలో కోథార్, తోడర్, ఇరుళర్, కుకుంబర్, కాట్టునాయకర్, పనియన్ తదితర తెగలకు చెందిన ఆదివాసీలు నివసిస్తున్నారు. వారిలో కోథార్ ప్రజలు పుదుకోతగిరి, కీలకోతగిరి, తిరుచ్చికడి, కొల్లిమలై, కోక్కాల్ తదితర ప్రాంతాల్లో అధికంగా నివసిస్తున్నారు. వారి సంప్రదాయ వృత్తిగా కుండలు, వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తారు. వీరు 'అయ్యనోర్ అమ్మనోర్'ను కులదేవతగా పూజిస్తుంటారు. సంప్రదాయాలు, కళాచారాలకు అధిక ప్రాధ్యాన్యతనిచ్చే వీరు, ప్రతి ఏడాది డిసెంబరు చివరన, జనవరి నెలల్లో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో, కోతగిరి నెహ్రూ పార్క్‌లో నిర్మించిన 'అయ్యనోర్ అమ్మనోర్' ఆలయంలో సోమవారం ఉత్సవం నిర్వహించారు. ముందుగా పుదుకోతగిరి నుంచి సంప్రదాయ దుస్తులు ధరించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఏడాదికి ఒకసారి మాత్రమే నిర్వహించే ఈ వేడుకల్లో పూజారి, సాంబ్రాణి ధూపం వేశారు. అనంతరం కోథార్ తెగ సంప్రదాయ నృత్యాన్ని పిల్లల నుంచి పెద్దలు వరకు చేస్తూ ఆనందంగా గడిపారు.

ఆలయాలకు సంక్రాంతి శోభ

ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం ● నేతల శుభాకాంక్షలు



కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న వాషర్‌మెన్‌పేట ఎంజీ రోడ్డు - విక్రయానికి సిద్ధంగా అల్లం పసుపు కొమ్ములు

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రజలు పొంగల్ జరుపుకొనేందుకు సన్నద్ధమయ్యారు. ప్రత్యేక పూజలకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలుముస్తాబయ్యాయి. పండుగ జరుపుకోనున్న ప్రజలకు రాజకీయ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతలు తాము పండించిన పంటలు సూర్య భగవానుడికి సమర్పించి తమను, తమ పశువులను చల్లగా చూడాలని వేడుకుంటూ సూర్య పొంగల్‌గా జరుపుకోనున్నారు. మంగళవారం పాలను మరిగించి, తీపి వంటకాలను తయారు చేసి, బంధువులు, పరిసర ప్రాంతాల్లో ఉన్న వారికి పంపిణీ చేసి ఆనందం పంచుకుంటారు. అందంగా రంగులు దిద్దిన కొత్త మట్టికుండలు కొనుగోలు చేసి పొంగల్‌పొంగించనున్నారు.పండుగ రోజున గ్రామాల్లో సాహసక్రీడలు, జానపద కార్యక్రమాలు, ఎద్దుల బండ్ల పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం కొనుగోలు దారులతో ప్రధాన వాణిజ్య ప్రాంతాలు, మార్కెట్లు, సంత వీధులు, ఉత్తర చెన్నై వాషర్‌మెన్‌పేటలో వస్త్ర దుకాణాలు అధికంగా ఉన్న ఎంజీ రోడ్డు కొనుగోలు దారులతో కిక్కిరిసి కనిపించాయి. అలాగే కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌లో పసుపు కొమ్ములు, అల్లం, చెరకు గడల అమ్మకాలు కూడా జోరుగా సాగాయని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

మాట్టుపొంగల్... : పొంగల్ పండుగ మూడో రోజు గోవులను ఆరాధించే మాట్టుపొంగల్‌గా జరుపుకోనున్నారు. ఆ రోజు ఎద్దులను, ఆవులను దేవుళ్లతో సమానంగా పూజిస్తారు. పశువులను విశేషంగా అలంకరించేందుకు అవసరమైన రంగురంగుల తాళ్లు, అలంకరణ సామగ్రి, మేత, తదితరాలను సిద్ధం చేసుకుంటున్నారు.

నేతల శుభాకాంక్షలు... : పొంగల్ పండుగ సందర్భంగా రాష్ట్రంలో ఆరోగ్యం, శ్రేయస్సు, మంచితనం, శాంతి, ఆనందం, సోదరభావం, సామాజిక న్యాయం వర్ధిల్లాలని కాంక్షిస్తూ, వివిధ రాజకీయ పార్టీల నేతలు రాష్ట్రప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షులు సెల్వపెరుందగై, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, బీజేపీ సీనియర్ నేత తమిళిసై, తమిళమానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ తదితర నేతలు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు.


సంక్రాంతి వేడుకల్లో టీఎంసీ నిర్వాహకులు

టీఎంసీలో ఘనంగా సంక్రాంతి

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) కార్యాలయంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా విభాగం తరపున మాజీ కౌన్సిలర్ రాణికృష్ణన్, కల్యాణి తదితరులు కార్యాలయం ప్రాంగణంలో ముగ్గులు వేసి పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ వేడుకల్లో టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, ప్రధాన కార్యదర్శి జీఆర్ వెంకటేశ్, వీటీ జవహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



తిరుప్పావై పోటీ విజేతలతో ఆలయ నిర్వాహకులు

వైభవంగా మార్గళి ఉత్సవాలు

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు సమీపంలోని కాకలూర్ శ్రీమన్నారాయణ రోడ్డు, మారుతీ న్యూటౌన్‌లో ఉన్న సెల్వ గణపతి ఆలయంలోని శ్రీరామ సన్నిధిలో మార్గళి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నిర్వహించిన తిరుప్పావై కంఠస్థ పోటీల్లో ఎల్కేజీ నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 30 పాశురాలను వల్లించారు. వీరికి ఆలయ నిర్వాహకులు ప్రసంశా పత్రాలు అందించి అభినందించారు. ముందుగా ఆలయంలో భోగి, పొంగల్ పండుగలను పురస్కరించుకొని విశేషపూజలు నిర్వహించి భక్తులకి ప్రసాదాలు పంపిణీ చేశారు.



కృష్ణగిరి జిల్లా హోసూరులో జరిగిన వల్లలారిన్ వివేగం ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవంలో జీవకారుణ్య సేవా పురస్కారాలను అందజేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పట్టాభిరామ్ వరకు మెట్రో లైన్

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు-ఆవడి మెట్రో రైలు ప్రాజెక్ట్ పట్టాభిరామ్ వరకు పొడిగించే అంశం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. చెన్నై మెట్రోరైలు ప్రాజెక్ట్ 2వ విడతలో మాధవరం-షోలింగనల్లూర్ మార్గాన్ని కోయంబేడు మీదుగా ఆవడి వరకు పొడిగించే అధ్యయనం తుది దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో, ఈ మార్గాన్ని పట్టాభిరాం వరకు పొడిగించేందుకు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం కోయంబేడు నుంచి ఆవడి వరకు 16.1 కి.మీ మెట్రో మార్గం ఏర్పాటు కానుండగా, పట్టాభిరాం వరకు పొడిగిస్తే మొత్తం రూ.20 కి.మీ చేరుకుంటుంది. ఇందుకు అదనంగా రూ.6,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా. అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో 15 ఎలివేటెడ్ స్టేషన్లు ఏర్పాటుచేయాల్సి ఉంది. అలాగే, ఆవడి లేదా పట్టాభిరాం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని ఖాళీ స్థలంలో మెట్రోస్టేషన్ నిర్మించనున్నారు. కోయంబేడు, పాడి పుదునగర్, వావిన్, అంబత్తూర్ ఎస్టేట్ బస్టాండ్, అంబత్తూర్ రైల్వేస్టేషన్, తిరుముల్లైవాయల్, ఆవడి రైల్వేస్టేషన్, తిరుమంగళం లేదా మొగప్పేర్‌లలో రైల్వే స్టేషన్ల ఏర్పాటయ్యే అవకాశముందని అధికారుల సమాచారం.



సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రామిక శాఖ కొత్త భవనాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అసలు పేరుతోనే పిలవండి ప్లీజ్

● రవి మోహన్



చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): 'జయం' చిత్రంతో 'జయ రవి' ప్రసిద్ధి చెందిన రవి తన అభిమానులు, సినీ ప్రేక్షకులకు ఓ విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండుగను జరుపుకుంటున్న ఈ మంచి తరుణంలో తనను జయం రవి పేరుతో కాకుండా, రవి లేదా రవి మోహన్ పేరుతో పిలవాలని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇకపై తనను జయం రవి అని పిలవొద్దని, రవి లేదా రవి మోహన్ అని పిలవాలని కోరారు. అలాగే, చిత్రపరిశ్రమపై తనకున్న ఎల్లలు లేని అభిమానానికి గుర్తుగా 'రవి మోహన్ స్టూడియోస్' అనే పేరుతో ఒక సినీ నిర్మాణ సంస్థను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఈ బ్యానరులో యంగ్ టాలెంట్, కథా రచయితలు, ఔత్సాహిక దర్శకులకు అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తామని వెల్లడించారు. అలాగే, తన అభిమాన సంఘం పేరును కూడా ఇకనుంచి 'రవి మోహన్ అభిమాన సంఘం'గా పేరు మార్చినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన మద్దతు, ప్రోత్సాహం ఇకపై కూడా కొనసాగించాలని రవి మోహన్ కోరారు.

కేఎంసీలో రోగిపై అత్యాచారయత్నం

● రాణిపేట యువకుడి అరెస్టు ● ఈపీఎస్ ఖండన

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్ వైద్యకళాశాల (కేఎంసీ) ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 50 యేళ్ల మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి ఆ యువకుడు మహిళా రోగుల వార్డులో ప్రవేశించి మహిళా రోగిపై అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆ మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కలున్న రోగులు సిబ్బంది పరుగెత్తుకొచ్చారు. దీంతో ఆ యువకుడు వార్డు నుంచి బయటపడి పరుగులు తీశారు. ఆసుపత్రి సిబ్బంది ఆ యువకుడిని బంధించి పోలీసులకు అప్పగించారు. కీల్పాక్ మహిళా పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని యువకుడిని అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో ఆ యువకుడు రాణిపేట ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్‌గా గుర్తించారు. కీల్పాక్ ఆస్పత్రి ప్రాంగణం వద్ద మద్యం మత్తులో జోగుతూ సతీష్‌కుమార్ మహిళా రోగుల వార్డులో చొరబడి మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ సంఘటన తర్వాత ఆసుపత్రి అంతటా పోలీసుల భద్రత పటిష్టం చేశారు. ఇదిలా ఉండగా ఈ సంఘటనపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి స్పందిస్తూ డీఎంకే పాలనలో మహిళలకు భద్రత లేదని మూడేళ్లుగా తాను చేస్తున్న ఆరోపణలు నిజమనేలా వరుసగా నగరంలో మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయనానరు.. ఆసుపత్రిలో రోగిపై అత్యాచార యత్నం విషయం తెలిసి దిగ్భ్రాంతి చెందానని తెలిపారు. రోగిపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుడికి కఠిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

చేపల మార్కెట్ ప్రారంభానికి అనుమతివ్వొద్దు

● హైకోర్టులో పిటిషన్ ● త్వరలో విచారణ

అడయార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చింతాద్రిపేటలో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన చేపల విక్రయ మార్కెట్‌ను ప్రారంభించకుండా స్టే విధించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీనిపై త్వరలో విచారణ జరుగనుంది. ఈ మార్కెట్‌లో వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ లేదని, చేపల శుభ్రం చేసేందుకు ఉపయోగించే నీరు నేరుగా పక్కనే ఉన్న కూవం కాలువలో కలుపుతున్నారని, ఈ నీరు కూవం నది కలుషితం చేస్తుందని, అందువల్ల ఈ మార్కెట్‌ను ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వరాదని పర్యావరణ పరిరక్షణ సంస్థ ఒకటి పిటిషన్ దాఖలు చేసింది. సింగార చెన్నై 2.0 పథకంలో భాగంగా చింతాద్రిపేటలోని పాత చేపల మార్కెట్ స్థానంలో కొత్తగా రూ.2.21 కోట్ల వ్యయంతో కొత్త మార్కెట్‌ను నిర్మించారు. ఇందులో 102 దుకాణాలు నిర్మించారు. అయితే, ఈ మార్కెట్‌లో ఉత్పన్నమయ్యే చెత్త, అపరిశుభ్ర నీరు వంటి వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను సక్రమంగా ఏర్పాటు చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పక్కాగా సిద్ధం చేసేంత వరకు మార్కెట్‌ను ప్రారంభించకుండా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు త్వరలోనే విచారణ చేపట్టనుంది.

బకింగ్‌హ్యామ్ కాలువలో మృతదేహం

అడయార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక షోళింగనల్లూరులో బకింగ్‌హ్యామ్ కాలువలో గుర్తు తెలియని ఒక వ్యక్తి శవం కొట్టుకు రావడం స్థానికంగా కలకలం సృష్టించింది. షోళింగనల్లూరు నుంచి ఈసీఆర్ రోడ్డు మార్గంలో కేకే నగర్ వద్ద బకింగ్‌హ్యామ్ కాలువలో సోమవారం ఒక వ్యక్తి శవం కొట్టుకురావడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సాయంతో అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని గట్టుకు చేర్చి, ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు 37 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరు? ఎలా చనిపోయారన్న అంశాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవ పరీక్ష కోసం రాయపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నీటమునిగి బాలిక మృతి

ఐసిఎఫ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు సమీపంలో నీటమునిగి బాలిక మృతిచెందింది. మేనల్లూర్ చెరువులో సుమిత్ర (10) సహా ముగురు బాలికలు సోమవారం స్నానాలకు వెళ్లారు. వారందరూ సరదాగా స్నానం చేస్తున్న సమయంలో హఠాత్తుగా ముగ్గురు లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగారు. వీరిని గమనించిన చుట్టుపక్కల వారు నీటిలో గాలించి ఇద్దరు బాలికలను రక్షించి చికిత్సకు తరలించారు. గ్రామస్తుల సమాచారం అగ్నిమాపక సిబ్బంది గంట సేపు గాలించి సుమిత్ర మృతదేహం వెలికితీశారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

20న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అదనపు రిజిస్ట్రేషన్లు

● 17న కూడా సెలవు ● ప్రభుత్వం ఆదేశం

అడయార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ ముహూర్త రోజు కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు పంపిణీ చేసి, అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు చేసేలా ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. పొంగల్ సెలవుల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ప్రభుత్వం వరుస సెలవులిచ్చింది. అయితే, 17వ తేదీ శుక్రవారం కూడా సెలవు ఇవ్వాలని ప్రభుత్వ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సొంతూళ్ళకు వెళ్ళిన వారు తిరిగి వచ్చేందుకు వీలుగా 17వ తేదీ శుక్రవారం ఆప్షనల్ హాలిడే ఇవ్వాలని కోరారు. దానిని అంగీకరించిన ప్రభుత్వం 17వ తేదీ సెలవుగా ప్రకటించి, దానికి బదులుగా ఈ నెల 25వ తేదీ శనివారం పని దినంగా ప్రకటించింది. అదేవిధంగా 18వ తేదీ శనివారం పనిచేయాల్సిన వంద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా సెలవు ప్రకటించింది. అయితే, 20వ తేదీ శుభముహూర్త రోజు కావడంతో ఆ రోజున అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని పేర్కొంది. అయితే, రోజువారీగా అందజేసే టోకెన్ల స్థానంలో అదనపు టోకెన్లు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు చేయాలని ఆదేశించింది. ముఖ్యంగా 100 టోకెన్లు ఇచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 150, 200 టోకెన్లు ఇచ్చే ఆఫీసుల్లో 300 టోకెన్లు జారీ చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

నగరంలో 325 సైబర్ క్రైం కేసులు

ప్యారీస్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో చిట్‌ఫండ్ పేరుతో సైబర్ నేరాలకు సంబంధించి గత ఏడాది 325 కేసులు నమోదుచేసి, రూ.36.63 కోట్లు స్తంభింపజేసినట్లు పోలీసులు తెలిపారు. సమాచార సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, సైబర్ క్రైం నేరాలు కూడా పెరుగుతూ పోలీసులకు సవాల్‌గా మారాయి. ఈ రకం మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు సైబర్ క్రైం అధికారులు పలు చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా చిట్‌ఫండ్ పేరుతో నగదు మోసానికి సంబంధించి సమర్పించే ఫిర్యాదులపై విచారణ జరిపి నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వులతో జైలుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో, గత ఏడాది సైబర్ క్రైం విభాగానికి 2,723 ఫిర్యాదులు రాగా, 325 కేసులు నమోదుచేశారు. దీనికి సంబంధించి 36 మంది అరెస్ట్ చేశారు. మరో ఏడుగురిని గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. నేరాలకు పాల్పడిన వారికి సంబంధించి రూ.36.63 కోట్ల నగదు స్తంభింపజేశారు. ఇందులో బాధితులకు న్యాయస్థానాల ద్వారా రూ.12.31 కోట్లు తిరిగి అప్పగించారు.

జయ ఆస్తులను దీపకు అప్పగించలేం :కర్ణాటక కోర్టు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక విధాన సౌధ ట్రెజరీలో భద్రపరచిన మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆస్తులను ఆమె మేనకోడలు దీపాకు అప్పగించలేమంటూ కర్ణాటక ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఆ మేరకు ఆ ఆస్తులన్నింటిని తమకే అప్పగించాలంటూ దీప వేసిన పిటిషన్ తోసిపుచ్చింది. జయలలిత అక్రమాస్తుల కేసుపై కర్ణాటక ప్రత్యేక కోర్టు విచారణ జరిపింది. జయలలిత, ఆమె సన్నిహితురాలు శశికళకు జైలు శిక్ష విధించింది. ఈ శిక్షను సుప్రీం కోర్టు కూడా ఖరారు చేసింది. ఆలోగా జయలలిత మృతిచెందటంతో, శశికళ నాలుగేళ్లపాటు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. ఆ తర్వాత జయలలిత ఆస్తులను వేలం వేయడానికి కర్ణాటక ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఈ విషయం తెలుసుకున్న దీప మాజీ ముఖ్యమంత్రి జయలలితకు తానే వారసురాలినని, ఆమె ఆస్తులన్నింటిని తనకే అప్పగించాలని బెంగళూరు ప్రత్యేక కోర్టులో పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ ప్రత్యేక కోర్టు జయలలిత ఆస్తులను దీపకు అప్పగించలేమంటూ సోమవారం తీర్పు వెలువరించింది. ఈ విషయమై దీపా సుప్రీం కోర్టులో అప్పీలు చేసుకోవచ్చునని కూడా పేర్కొంది.

ఎస్ఐ ఆత్మహత్య

అడయార్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న శశికుమార్ (34) ఆత్మహత్య చేసుకున్నారు. జిల్లాలోని అరచ్చలూరుకు చెందిన శశికుమార్ ఈరోడ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తుండగా ఈయన భార్య కూడా అరచ్చలూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం శశికుమార్ అరచ్చలూరులోని తమ నివాసంలోనే ఉరేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన భార్య పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మేట్టూరు డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టూరు డ్యాం నుంచి వస్తున్న నీటి రాక తగ్గింది. కావేరి పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యాంలోని శనివారం 745 ఘనపుటడుగులు వస్తున్న నీరు ఆదివారం ఉదయం 674 ఘనపుటడుగులకు తగ్గింది. డెల్టా సాగుకు డ్యాం నుంచి 5.300 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 115.03 అడుగుల చొప్పున 85.76 టీఎంసీల నీటిమట్టాలున్నాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

సీఎం సొంతూరు నారావారిపల్లెకు సంక్రాంతి శోభ వచ్చింది. సీఎం చంద్రబాబు కుటుంబీకుల రాకతో సందడి నెలకొంది. సంప్రదాయబద్ధంగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మరోవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. సంక్షేమ కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. ఈ రెండు కార్యక్రమాల్లోనూ ఆయన సోమవారమంతా బిజీగా గడిపారు.





నారావారిపల్లెలో నేడు

చంద్రగిరి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ గ్రామ దేవత దొడ్డి గంగమ్మను, కుల దైవం నాగాలమ్మను దర్శించుకోనున్నారు. అనంతరం చంద్రబాబు తల్లితండ్రులు నారా ఖర్జురపునాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు నివాళులర్పిస్తారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, బసవతారకం విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈ విగ్రహావిష్కరణ సినీనటుడు, నందమూరి బాలకృష్ణ ఆవిష్కరించనున్నట్లు సమాచారం. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబు మాట్లాడనున్నారు.



స్ప్రింక్లర్ వాహనాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

నారావారిపల్లెకు సంక్రాంతి శోభ

- అటు ఆటలు, ముగ్గుల పోటీలు
- ఇటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- కుటుంబీకులు, గ్రామస్తులతో ఉల్లాసంగా గడిపిన సీఎం చంద్రబాబు

తిరుపతి(వైద్యం), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భోగి పండుగ రోజైన సోమవారం సీఎం చంద్రబాబు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేర్ అండ్ గ్రోతో ఇప్పటికే కుప్పంలో 480 కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలకు సామర్థ్య పెంపుదల కార్యక్రమాలను చేపడుతూ పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని సీఎం చంద్రబాబు అన్నారు.

ఆసక్తిగా ఆటలు

విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటల పోటీలను కుటుంబ సభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు తిలకించారు. బెలూన్ బ్లాస్టింగ్, మ్యూజికల్ చైర్స్, పొటాటో కలెక్ట్, గోతాల జంపింగ్ వంటి పోటీల్లో స్థానిక పిల్లలతో కలిసి నారా దేవాన్ష్ కూడా ఉత్సాహంగా పాల్గొన్నాడు. విజేతలకు తన సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు బహుమతులు అందించారు. బహుమతుల ప్రదానం సమయంలో వేదికపైనే ఉన్న మంత్రి నారా లోకేశ్.. కాసేపు మైక్ చేతపట్టి సందడి చేశారు.

అలరించిన ముగ్గుల పోటీలు

నారావారిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలను ఎంపిక చేశారు. అనంతరం 10.30 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వచ్చిన సీఎం చంద్రబాబు ముగ్గులను పరిశీలించారు. అనంతరం సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణితో కలిసి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని తనుశ్రీ, గాయత్రి.. ద్వితీయ, తృతీయ బహుమతులను బి.నాగలక్ష్మి, ఎం.పూజిత అందుకున్నారు. అందరితో కలిసి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని భువనేశ్వరి అన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 126 మందికీ ప్రోత్సాహంగా రూ.10,116 చొప్పున బహుమతి ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఇలా మరెన్నో పండుగలు మీతోనే కలిసి జరుపుకోవాలని కోరుకుంటున్నాని నారా బ్రాహ్మిణి అన్నారు.

